క్లుప్తంగా

పూర్వ విద్యార్థుల సహకారంతో అభివృద్ధి



భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న వీసీ ప్రసాదరాజు

బాలాజీచెరువు: పూర్వ విద్యార్థుల సహకారంతోనే వర్సిటీ అభివృద్ధి సాధిస్తుందని జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు అన్నారు. స్థానిక జేఎన్‌టీయూ ఇండోర్ స్టేడియంలో పూర్వ విద్యార్థుల సహకారంతో ప్లాటినం జూబ్లీ అల్యూమినీ సెంటర్ భవనానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వీసీ ప్రసాదరాజు మాట్లాడుతూ కళాశాల పూర్వ విద్యార్థి ముత్యాల భాస్కరరావు భార్య సీతారత్నం పేరుతో ప్లాటినం అల్యూమినీ సెంటర్ నిర్మిస్తున్నామని, దీనికి రూ.2 కోట్లు విరాళం అందించగా వర్సిటీ నిధులు రూ.2 కోట్లతో కలిపి పనులు జరుగుతున్నాయన్నారు. భవన నిర్మాణానికి సాంకేతిక సహకారం అందించిన ఆర్‌అండ్‌డీ డైరెక్టర్ రవీంద్ర, గట్టి సత్యనారాయణ, వైఎస్ఎన్ మూర్తిలను అభినందించారు. కార్యక్రమంలో రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ సుమలత, ప్రిన్సిపాల్ కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో ఎన్‌ఆర్‌ఐల పాత్ర కీలకం



ఎన్‌ఆర్‌ఐలకు కరపత్రాలు అందిస్తున్న రీజినల్ హెడ్ సాయిమనోహర్

బోట్‌క్లబ్: దేశాభివృద్ధిలో ఎన్‌ఆర్‌ఐలు ముఖ్య పాత్ర పోషిస్తున్నారని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కాకినాడ రీజినల్ హెడ్ కె.సాయిమనోహర్ అన్నారు. గురువారం స్థానిక తిలక్‌వీధిలోని యూఎంఎఫ్‌బీ బ్రాంచ్‌లో ఎన్‌ఆర్‌ఐల కోసం ప్రవాసీ హయార్ గౌరవ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనియన్ బ్యాంకు ఎన్‌ఆర్‌ఐలకు ప్రాధాన్యాన్ని గుర్తించి వివిధ ఆర్థిక సేవలు అందిస్తోందన్నారు. సమావేశంలో కాకినాడ రీజియన్ డిప్యూటీ హెడ్ డీవీ రంగారావు, బ్యాంక్ చీఫ్ మేనేజర్ విశ్వనాథ్, లోకల్ బ్రాంచ్ మేనేజర్లు, రీజినల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వామనావతారంలో సీతారామస్వామి



బోట్‌క్లబ్: స్థానిక మెయిన్‌రోడ్డులో ఉన్న సీతారామ స్వామి ఆలయంలో ధనుర్మాస వ్రత మహోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారు వామనావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకుడు భావవరపు భాస్కరాచార్యులు పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

రేపు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

కాకినాడ: స్థానిక డైరీఫారం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో వార్షిక మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో డీఈ జి.ప్రసాద్ తెలిపారు. ఫీడర్ పరిధిలో డాల్ఫిన్ కాలనీ, రెవెన్యూ కాలనీ, జ్యోతుల కాలనీ, సాంబమూర్తినగర్ 1, 2, 3, 4, 5 వీధులు, బాలవెంకటనగర్, డైరీఫారం సెంటర్, వెంకటేశ్వరనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. ఈ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

అంగన్‌వాడీల ధర్నా

కాకినాడ రూరల్: సర్పవరం జంక్షన్‌లోని తహసీల్దార్ కార్యాలయం వద్ద సమ్మెలో పాల్గొంటున్న అంగన్‌వాడీలు గురువారం పోస్టుకార్డులతో నిరసన తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించాలని పోస్టు కార్డులను ముఖ్యమంత్రికి పంపుతున్నట్టు వారు తెలిపారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన

కాకినాడ సిటీ: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ స్థానికంగా సమగ్ర శిక్ష ఉద్యోగులు గురువారం వంటా వార్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ శిబిరానికి సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ హామీలు అమలు చేయాలని అన్నారు. నాయకులు దువ్వా శేషుబాబ్జీ, చెక్కల రాజ్‌కుమార్, మలకా రమణ పాల్గొన్నారు.

గుండె గూటికి పండగ



రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీ దండుపుంతలో పేదల ఇళ్లు

- దండుపుంత వాసులకు ముందే సంక్రాంతి
- ఎమ్మెల్యే కన్నబాబు కృషితో శాశ్వత భూ హక్కు పత్రాలు

కాకినాడ రూరల్: గుండె 'గూటికి' పండగొచ్చింది.. పేదలకు 'పట్టా'భిషేకం జరిగింది.. కూలీనాలీ చేసుకుంటూ బతుకు జీవుడా అంటూ పూరి గుడిసెలనే పెద్ద ప్యాలెస్‌లుగా భావించి కాలం వెళ్లదీస్తున్న వారి కల నెరవేరింది.. మూడు దశాబ్దాల కిందట వివిధ ప్రాంతాల నుంచి కాకినాడ రూరల్ రమణయ్యపేటలోని దండుపుంతకు వలస వచ్చి గుడిసెల్లో కాలం గడుపుతున్న పేదలకు జగనన్న ప్రభుత్వం సంక్రాంతికి ముందే పండగ తెచ్చింది.. 30 ఏళ్లుగా తమకు పట్టాలు ఇవ్వాలని మొరపెట్టుకుంటున్న పేదల పక్షాన ఎమ్మెల్యే కురసాల కన్నబాబు నిలిచి వారి కలను సాకారం చేశారు. రమణయ్యపేట ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని దండుపుంతలో అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తూ విలువైన స్థలంలో వారు ఉంటున్న చోటే శాశ్వత భూ హక్కును కల్పించారు. ఇండస్ట్రియల్ ఏరియాలో పేదలకు పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వడం చిన్న విషయం కాకున్నా మంత్రిగా ఉన్నప్పటి నుంచే సమస్యను ప్రభుత్వం, సీఎం జగన్ దృష్టికి కన్నబాబు తీసుకువెళ్లి పరిష్కరించారు. ఏడాది కిందట దండుపుంతలోని 72 మందికి పట్టాలు పంపిణీ చేసిన ఆయన మిగిలిన 97 మందికి ఇటీవల రమణయ్యపేట పార్టీ క్యాంపు కార్యాలయంలో పొజిషన్ పట్టాలు అందజేశారు. ఇలా దండుపుంత వాసులు 169 మందికి శాశ్వత భూ హక్కు కల్పించేలా పట్టాలు అందించి వారి కలగా సాకారం చేశారు. పరిశ్రమలు, దుకాణాల్లో మూటలు మోస్తూ కూలి పనులు చేసుకునే పేదలు నేడు వృద్ధాప్యంలో ఉన్నారు. వారి పిల్లలు అక్కడే వారితోనే నివాసం ఉంటున్నారు. ఎమ్మెల్యే కన్నబాబు కృషితో తమకు పట్టాలు ఇచ్చారని, వారి రుణం తీర్చుకోలేమని దండుపుంత వాసులు పేర్కొంటున్నారు. మళ్లీ జగనన్న సీఎంగా, కన్నబాబు ఎమ్మెల్యేగా గెలవాలని ఆ పేద కుటుంబాలు కోరుకుంటున్నాయి.

ఆలకించి.. పట్టాలిచ్చి



మేం 30 ఏళ్లుగా గుడిసెలు, చిన్న ఇళ్లను నిర్మించుకుని దండుపుంతలో నివాసముంటున్నాం. గతంలో ఏ ప్రభుత్వం మా గోడు పట్టించుకోలేదు. వయసు పెరిగిపోయింది. కూలి పనులు చేసుకునే మాకు దీర్ఘకాలిక రోగాలు వచ్చాయి. షుగర్ ఉండడంతో నా భర్త కాలి వేళ్లు తొలగించారు. మా గోడు ఎమ్మెల్యే కన్నబాబు ఆలకించి పట్టాలు అందజేశారు. ముఖ్యమంత్రి జగనన్నకు, ఎమ్మెల్యే కన్నబాబుకు ధన్యవాదాలు.

– గీసాల వెంకటలక్ష్మి, దండుపుంత, రమణయ్యపేట

ఎమ్మెల్యేకు రుణపడి ఉంటాం..



దండుపుంతలో ఏళ్ల తరబడి ఉంటున్న పేదల మొర ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఆలకించారు. ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకువెళ్లారు. మాకు శాశ్వత భూ హక్కు పట్టాలు ఇచ్చారు. దండుపుంతలో పేద కుటుంబాలన్నీ కన్నబాబుకు రుణపడి ఉంటాయి. ఆయన మళ్లీ ఎమ్మెల్యేలా గెలిచేలా అండగా ఉంటాం.

– తుర్లంపూడి నాని, దండుపుంత, రమణయ్యపేట

వైద్య రంగానికి ప్రభుత్వం ప్రాధాన్యం



మండల పరిషత్ కార్యాలయంలో స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ

కాకినాడ రూరల్: రాష్ట్రంలో వైద్య రంగానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. కాకినాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో గురువారం రూరల్ నియోజవర్గంలోని లబ్ధిదారులకు కొత్త ఫీచర్లతో స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డులను కన్నబాబు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పేరు చెబితే మాజీ సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి గుర్తుకొస్తారన్నారు. ఆరోగ్యశ్రీ పథకం వచ్చాక పేదలకు కార్పొరేట్ వైద్యం దరిచేరిందన్నారు. 108, 104 వాహనాలను రాజశేఖరరెడ్డే ప్రవేశ పెట్టారన్నారు. గత టీడీపీ ప్రభుత్వం ఆరోగ్యశ్రీని నీరుగార్చిందని, 2019లో అధికారంలోకి వచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ఆరోగ్యశ్రీకి పునర్జీవం పోశారన్నారు. అంతేకాకుండా 3,257 రోగాలకు వైద్యం అందించేలా సీఎం జగన్ చర్యలు తీసుకున్నారని కన్నబాబు అన్నారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీలో రూ.25 లక్షల వరకూ ఉచిత వైద్యం అందించేందుకు సీఎం జగన్ నిర్ణయం చేసుకున్నారన్నారు. దీనివల్ల వైద్యం కోసం పేద, మధ్య తరగతికి చెందిన ప్రజలు అప్పులు చేయాల్సిన పనిలేదన్నారు. ప్రభుత్వమే పూర్తిగా వైద్య ఖర్చులు భరించి ఉచితంగా సేవలు అందజేస్తుందన్నారు. రాష్ట్రంలో సీఎం జగన్‌తో సంక్షేమ పాలన సాగుతుందన్నారు. విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ నారాయణమూర్తి, ఎంపీడీఓ స్వప్న, నాయకుడు గోపుశెట్టి బాబ్జీ, నేమాం సర్పంచ్ రామదేవు సూర్య ప్రకాశరావు, కరప తహసీల్దార్ శ్రీనివాసరావు, రాష్ట్ర పంచాయతీ రాజ్ ఉద్యోగుల సంఘ నాయకుడు రమేష్, పలు గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

రెల్లిపేటలో రూ.8.4 కోట్లతో క్వార్టర్లు

- పనులు పరిశీలించిన ఎమ్మెల్యే ద్వారంపూడి
- త్వరగా పూర్తి చేయాలని సూచన



క్వార్టర్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: స్థానిక జగన్నాథపురం 23వ డివిజన్ రెల్లిపేటలో రూ. 8.4 కోట్ల కార్పొరేషన్ నిధులతో పారిశుధ్య కార్మికుల కోసం క్వార్టర్స్ నిర్మాణం శరవేగంగా జరుగుతోందని సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి చెప్పారు. ఈ నిర్మాణ పనులను గురువారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. పనుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శిథిలావస్థకు చేరిన క్వార్టర్స్‌ను చక్కని సదుపాయాలతో రూ.8.4 కోట్లు వెచ్చించి పునర్నిర్మిస్తున్నట్లు చెప్పారు. త్వరగా వీటి నిర్మాణ ప్రక్రియ పూర్తి చేసి ఫిబ్రవరి నాటికల్లా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆయన ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సుమారు 42 మంది పారిశుధ్య కార్మికులు నివాసం ఉండేందుకు వీలుగా జీప్లస్ వన్ విధానంలో ఈ నిర్మాణం జరుగుతుందన్నారు. విద్యుత్, టైల్స్ తదితర పనులను కూడా త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎమ్మెల్యే వెంట నగరపాలక సంస్థ డీఈ లోవరాజు, మాజీ డిప్యూటీ మేయర్ మీసాల ఉదయ్‌కుమార్, మాజీ కార్పొరేటర్ మీసాల దుర్గాప్రసాద్, రెల్లిపేట పెద్దలు ఉన్నారు.

3న సీఎం పర్యటన విజయవంతం చేద్దాం



కరపలో సమీక్షిస్తున్న డీడీఓ నారాయణమూర్తి

కరప: కాకినాడలో వచ్చే నెల 3న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేసేందుకు మహిళాశక్తి సంఘాలు, గ్రామ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని డీడీఓ పాఠంశెట్టి నారాయణమూర్తి సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో వీఓఏలు, వీఓలు, పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశమై సీఎం జగన్ కార్యక్రమం గురించి వివరించారు. అనుసరించాల్సిన కార్యాచరణపై పలు సూచనలు చేశారు. జనవరి నుంచి వైఎస్సార్ పింఛన్ కానుకలో ప్రతి నెలా ఇచ్చే పింఛన్ సొమ్ము రూ.3 వేలకు పెంచి, కాకినాడలో లాంఛనంగా ప్రారంభిస్తారన్నారు. సీఎం బహిరంగ సభ గురించి గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. దీనికి వచ్చేవారికి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని డీడీఓ సూచనలిచ్చారు. సమీక్షలో ఎంపీడీఓ కె.అప్పారావు, ఏపీఎం ఎంఎస్‌బీ దేవి, సీసీ రామకృష్ణ, కార్యదర్శి ఎస్‌కే నాగేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర పోరాటంలో కోకనాడ సభకు గుర్తింపు



సూర్యకళా మందిరంలో కోకనాడ మహాసభ శతాబ్ది ఉత్సవంలో ప్రముఖులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): స్వాతంత్య్ర పోరాటంలో కోకనాడ మహాసభకు విశిష్ట గుర్తింపు ఉందని శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్ అన్నారు. కాకినాడ సినిమా రోడ్‌లోని సూర్యకళా మందిరంలో అఖిల భారత జాతీయ కాంగ్రెస్ కోకనాడ మహాసభ శతాబ్ది ఉత్సవం నిర్వహించారు. కాకినాడలో అఖిల భారత కాంగ్రెస్ మహాసభలు నిర్వహించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా శతాబ్ది ఉత్సవాలు నిర్వహించడం సంతోషకరమన్నారు. కేంద్ర మాజీ మంత్రి మల్లిపూడి పళ్లంరాజు మాట్లాడుతూ స్వాతంత్య్ర సమర చరిత్ర పరిశోధన సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ చిరంజీవిని కుమారి అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం శతాబ్ది ఉత్సవాల పుస్తక ఆవిష్కరణ ప్రముఖుల చేతుల మీదుగా జరిగింది. దేశభక్తి గీతాలు, వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఎంఎల్‌సీ ఐవీ రావు, రాష్ట్ర గ్రంథాలయ సంఘ ప్రధాన కార్యదర్శి డాక్టర్ రావిశారద పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..



మూడో డివిజన్‌లో క్రీడా కిట్లు పంపిణీ చేస్తున్న మాజీ కార్పొరేటర్ మణికుమార్ తదితరులు



కరపలో వాలీబాల్ క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న పీడీ శ్రీనివాస్

- జోరుగా 'ఆడుదాం ఆంధ్ర' పోటీలు

కరప: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు కరప మండలంలో మూడోరోజు గురువారం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. అరట్లకట్ట, కరప, నడకుదురు, గురజనాపల్లి, పెద్దాపురప్పాడు, వేములవాడ, వేళంగి గ్రామాల్లోని జెడ్పీ ఉన్నత పాఠశాలల క్రీడా మైదానాల్లో బాడ్మింటన్, క్రికెట్, వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఎంపీడీఓ కె.అప్పారావు సచివాలయాల కార్యదర్శులు, పాఠశాలల పీడీలతో కలసి ఆయా గ్రామాల్లోని ఆటల పోటీలను పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహించేందుకు «ఆడుదాం ఆంధ్ర» పోటీలను నిర్వహిస్తుందన్నారు. క్రీడాకారులు ప్రతిభ చాటాలన్నారు. మూడో రోజు 42 మ్యాచ్‌లు జరిగినట్టు ఎంపీడీఓ తెలిపారు. ఇందులో బాడ్మింటన్–17, క్రికెట్–12, వాలీబాల్–6, కబడ్డీ–7 మ్యాచ్‌లు జరిగాయన్నారు.

క్రీడా కిట్ల పంపిణీ

కాకినాడ రూరల్: ఆడుదాం ఆంధ్రా క్రీడా సంబరాల్లో భాగంగా వివిధ జట్లకు క్రీడా కిట్లను కాకినాడ అర్బన్ 3వ డివిజన్ మాజీ కార్పొరేటర్ వడ్డి మణికుమార్ గురువారం పంపిణీ చేశారు. యువతను ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో డివిజన్‌లోని క్రీడాకారులు, యువత ఉత్సాహంగా పాల్గొనాలని కోరారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఆదేశానుసారం క్రీడాకారులకు కిట్లు పంపిణీ చేశామన్నారు. సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ సతీష్, వైఎస్సార్ సీపీ నాయకులు భువనేశ్వరి, దైవ కృష తదితరులు పాల్గొన్నారు.

కరప ఎస్‌ఐగా రామకృష్ణ



కరప: స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐగా టి.రామకృష్ణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ఎస్‌ఐగా పనిచేసిన నౌడు రామకృష్ణ గండేపల్లి పోలీస్ స్టేషన్‌కు బదిలీ కాగా, పెదపూడి నుంచి టి.రామకృష్ణ ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరప మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజాప్రతినిధులు, ప్రజలు సహకరించాలన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే బాధ్యులపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎక్కడైనా జూదం, కోడిపందేలు నిర్వహిస్తే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను ఆయన కోరారు.

కుట్టు మెషీన్ అందజేత



పేద మహిళకు కుట్టు మెషీన్ అందిస్తున్న శ్రీనిధి సంస్థ సభ్యులు

కాకినాడ రూరల్: చిత్రాడ గ్రామానికి చెందిన పేద మహిళ స్వయం ఉపాధి కోసం కాకినాడ మధురా నగర్ శ్రీనిధి సేవా సంస్థ సభ్యులు గురువారం ఉచితంగా కుట్టు మెషీన్‌ను అందించారు. శ్రీనిధి సంస్థ సభ్యులు కరుణ, శ్యామల, ఈశ్వరి, వాణి, ఇందిరా, విజయలక్ష్మి, రాజేశ్వరి, స్వప్న, రాణి తదితరులు మాట్లాడుతూ తమకు ఉన్న దాంట్లో కొంత సొమ్ము సేవా కార్యక్రమాలకు వినియోగిస్తూ సంతృప్తి చెందుతున్నామన్నారు.

సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించండి



అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ నాగనరసింహారావు

కాకినాడ: రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నియోజకవర్గ పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో సమస్యాత్మక, అతి సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించాలని సిటీ నియోజకవర్గ ఈఆర్వో, కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం ఈ విషయమై స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో ఏఈఆర్వోలు, సెక్టోరల్ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. కాకినాడ సిటీ పరిధిలో 233 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, వీటిలో సమస్యాత్మక, అతి సమస్యాత్మక ప్రాంతాలను బీఎల్వోల తోడ్పాటుతో గుర్తించి నివేదిక ఇవ్వాలని కోరారు. నివేదిక అనంతరం అక్కడ తీసుకోవాల్సిన చర్యలను ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. సమావేశంలో ఏఈఆర్వోలు, సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

ఊరంతా సంక్రాంతి సందడి



సంక్రాంతి సంబరాల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి



రంగవల్లుల పోటీలో మహిళలు

- ఉత్సాహంగా జగనన్న సంబరాలు

కాకినాడ: జగనన్న సంక్రాంతి సంబరాలు ఉత్సాహభరిత వాతావరణంలో రెండో రోజు కూడా కొనసాగాయి. సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో గురువారం కాకినాడ 7, 18, 35, 39 డివిజన్ల పరిధిలో 8 చోట్ల నిర్వహించారు. ముగ్గులు, మ్యూజికల్ చైర్, టగ్ ఆఫ్ వార్ పోటీలకు మహిళలు ఉత్సాహంగా హాజరయ్యారు. మొత్తం నాలుగు క్లస్టర్లు, 8 సచివాలయాల పరిధిలో జరిగిన జగనన్న సంక్రాంతి సంబరాల్లో గురువారం సుమారు వెయ్యి మందికి పైగా మహిళలు పాల్గొన్నారు. పోటీల్లో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ప్రకటించారు. సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి 35వ డివిజన్‌లో జరిగిన పోటీలకు హాజరై తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంప్రదాయ క్రీడా క్రీడలను ప్రోత్సహించి మహిళల్లో సంక్రాంతి సందడి తీసుకురావాలనే లక్ష్యంతోనే ఈ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఒకటో క్లస్టర్‌లో వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్, రెండో క్లస్టర్‌లో రాష్ట్ర రైస్‌మిల్లర్ల సంఘ అధ్యక్షుడు వీరభద్రారెడ్డి, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి పర్యవేక్షించారు. మూడో క్లస్టర్‌లో పార్టీ నాయకులు రాగిరెడ్డి సుబ్బారావు, ఏఎంసీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, నాల్గో క్లస్టర్‌లో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఇనుకొండ పట్టాభిరామయ్య పోటీలను పర్యవేక్షించారు.

వైఎస్సార్ సీపీ విజయాన్ని కాంక్షిస్తూ పాదయాత్ర



పాదయాత్ర చేస్తున్న శ్రేణులతో ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, సిటీ రూరల్ ఎమ్మెల్యేలుగా ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కురసాల కన్నబాబు మళ్లీ విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ సుమారు 40 మంది గురువారం కాకినాడ నుంచి వాడపల్లికి పాదయాత్ర చేపట్టారు. స్థానిక 19వ డివిజన్ నాయకుడు మానే శ్రీనివాస్ గౌడ్, డివిజన్ ఇన్‌చార్జి సిద్ధాంతపురాజుతో పాటు సుమారు 40 మంది చేపట్టిన ఈ పాదయాత్రను సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి గురువారం ఉదయం ప్రారంభించారు. దాదాపు 70 కిలోమీటర్లు పాదయాత్రగా శనివారం మధ్యాహ్నానికి వాడపల్లి వేంకటేశ్వర స్వామిని దర్శించి మొక్కును తీర్చుకోనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ పాదయాత్ర దిగ్విజయంగా సాగి, వీరి ఆకాంక్ష నెరవేరాలన్నారు. మిత్ర బృందం జీఆర్‌కే రాజు, గంటా కృష్ణ, మట్టపర్తి శ్రీను, బొర్రా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, పార్టీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఏఎంసీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, రాష్ట్ర రైస్‌మిల్లర్ల సంఘ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, మాజీ కార్పొరేటర్లు తదితరులు ఉన్నారు.

నాగబాబుకు అభినందన



నాగబాబును అభినందిస్తున్న కమిషనర్ నాగనరసింహారావు

కాకినాడ: ఒంగోలు జిల్లా రామయ్యపట్నంలో ఈ నెల 24, 25 తేదీల్లో జరిగిన రాష్ట్ర మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్– 2023 పోటీల్లో పతకాలు సాధించిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సబ్ యూనిట్ అధికారి యాతం నాగబాబును నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు గురువారం అభినందించారు. కాకినాడ జిల్లా నుంచి పోటీల్లో పాల్గొన్న నాగబాబు 200, 400, 800 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానంలో నిలిచి మూడు బంగారు పతకాలు సాధించారు. ఫిబ్రవరి 2 నుంచి 4వ తేదీ వరకూ ముంబయిలో జరిగే 43వ నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్ చాంపియన్ షిప్ పోటీలకు కూడా ఆయన ఎంపికయ్యారు. ఇప్పటి వరకూ మొత్తం 60 పతకాలు సాధించిన నాగబాబును కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు.

నేడు బీజేపీ బూత్ స్థాయి సమావేశం

కాకినాడ రూరల్: కాకినాడ కాపు కల్యాణ మండపంలో శుక్రవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి నిర్వహించనున్న బూత్ స్థాయి అధ్యక్షుల సమావేశానికి రూరల్ నియోజవర్గంలోని బూత్ స్థాయి అధ్యక్షులు హాజరుకావాలని ఆ పార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం రూరల్ నియోజవర్గంలో బీజేపీ నాయకులు రంబాల వెంకటేశ్వరరావు, తంబాల వెంకటేశ్వరరావు, కవికొండల భీమశేఖర్, పితాని లీలావతి, అనపర్తి వెంకటేష్, బొలిశెట్టి రామకృష్ణ తదితరులు పర్యటించారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



వలసపాకల కోరేపు ప్రార్థనా మందిరంలో క్రీస్తు గీతాలు ఆలపిస్తున్న చిన్నారి

కాకినాడ రూరల్: వలసపాకల గ్రామ కోరేపు ప్రార్థనా మందిరంలో పాస్టర్ ప్రవీణ్ బెన్నీ ఆధ్వర్యంలో చిన్నారుల మధ్య క్రిస్మస్ వేడుకలు గురువారం రాత్రి నిర్వహించారు. ఏసుక్రీస్తు భక్తి గీతాలను చిన్నారులు ఆలపించి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా పాస్టర్ ప్రవీణ్ బెన్నీ మాట్లాడుతూ క్రీస్తు మార్గం సర్వ మానవాళికి అనుసరణీయమన్నారు. శాంతి మార్గం చూపిన ఏసు జీవితం అందరికీ ఆదర్శనీయమన్నారు. బైబిల్‌లో బోధించినట్టు ఆయన సమాధానకర్తగా ఈ లోకానికి వచ్చారన్నారు. కార్యక్రమంలో సరోజి బెన్నీ, త్రిమూర్తులు, బ్రదర్ అశోక్‌కుమార్, జాన్ ఐజయ్య, మార్తమ్మ, వెంకట లక్ష్మి, విజయ స్వరూప రత్నం, కరుణామూర్తి తదితరులు పాల్గొన్నారు.

నాగమల్లితోట జంక్షన్: యంగ్‌మెన్ క్రిస్టియన్ అసోసియేషన్ కాకినాడ శాఖ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ వెనుక సిటీ టేబర్నికల్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. దీనికి చర్చి పాస్టర్, వైఎంసీఏ అధ్యక్షుడు పీఎం హెన్రీ అధ్యక్షత వహించారు. వైఎంసీఏ కార్యదర్శి పీజేవీకే గాంధీ సంస్థ ద్వారా నిర్వహిస్తున్న సేవలను వివరించారు. ముఖ్యఅతిథి పాస్టర్ శాంసన్ శామ్యూల్ క్రిస్మస్ సందేశాన్ని అందించారు. అనంతరం జి.రూపకళ్యాణి, స్టీఫెన్ సౌజన్యంతో సమకూర్చిన బహుమతులను పలు పోటీల్లో విజేతలకు అందజేశారు.